క్లుప్తంగా

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యాని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఆయా కేంద్రాల్లో 174 మందికి గాను 153 మంది విద్యార్థులు పరీక్ష రాశారని వీసీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 21 నుంచి 24 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే 9 వ జాతీయ స్థాయి మహిళల సీనియర్ నెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జిల్లా జట్టు క్రీడాకారులు పతకాలు సాధించాలని ఆ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరబాబు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు సుమాంజలి (క్రిష్ణగిరి), స్వాతి (ఆదోని), కీర్తి (మిడుతూరు), మౌనిక (పంచలింగాల)ను అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది ఆనందరావు, నాగరత్నమయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ డ్రైవర్ల వేతనాలు చెల్లించాలి

కర్నూలు(రాజ్‌విహార్): మున్సిపల్ కర్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీసీఎల్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

నంది పద్య నాటక పోటీలకు ఎంపిక

కర్నూలు కల్చరల్: నంది నాటకోత్సవాలు -2022కు జిల్లాకు చెందిన రెండు పద్య నాటకాలు ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని మురళీ కృష్ణ పోటీలకు ఎంపికైన నాటకాల వివరాలను మంగళవారం ప్రకటించారు. ఇందులో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కమలపాలిక ' నాటకం ఎంపికైంది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దీనికి దర్శకులుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ నాటకం తెనాలి పోటీల్లో ద్వితీయ బహుమతి, మిర్యాల గూడ తెలంగాణ సాంస్కృతిక కేంద్రం నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుంది. మరో నాటకం కర్నూలు కళాకారుల సంక్షేమ సంఘం వారి 'ఆనంద నిలయం' ఎంపికైంది. పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన ఈ నాటకానికి వి.వి. రమణారెడ్డి దర్శకులుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ నాటకం తిరుపతి గరుడ పోటీల్లో బహుమతులు అందుకుంది. నాటకాల దర్శకులు, కళాకారులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అక్టోబర్‌లో నంది నాటకోత్సవాలు నిర్వహించనున్నారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపడతాం

కర్నూలు (టౌన్) : వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుని పోలింగ్ స్టేషన్ల హేతబద్ధీకరణ చేపడతామని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు పోలింగ్ స్టేషన్లు పని చేయని స్థితిలో ఉన్నాయని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

రేమట రోడ్డు పనులు ప్రారంభం

కర్నూలు (న్యూసిటీ): రేమట గ్రామానికి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. పూర్తిగా దెబ్బతిన్న ఈరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ. 5 కోట్లతో ఉల్చాల నుంచి రేమట, కొత్తకోట వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు వేయనున్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధాకర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని వారు కోరారు.

యోగా పరీక్షల్లో జిల్లా వాసుల ప్రతిభ


అవినాష్ శెట్టి


విజయ్‌కుమార్

కర్నూలు (టౌన్): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా ఈనెల 17,18 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి న్యాయ నిర్ణేతల పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాకు చెందిన రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్‌శెట్టి బి. గ్రేడ్, కల్లూరుకు చెందిన యోగ గురువు విజయ్‌కుమార్ సీ గ్రేడ్ సాధించారు. జాతీయ స్థాయిలో రాణించిన యోగ శిక్షకులను ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి , యోగ ఫెడరేషన్ ఇండియా సభ్యులు న్యాయవాది శ్రీధర్ రెడ్డి అభినందించారు.

సీఎంకు స్వాగతం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. కృష్ణగిరి మండలం ఆలంకొండ వద్ద హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం నుంచి 77 చెరువులకు నీటిని ఎత్తిపోసే మోటార్లను స్విచ్ ఆన్‌చేసి తర్వాత డోన్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన సీఎంను పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు స్వాగతం పలికి బొకే అందజేశారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు బొకే అందజేస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి, ఎంపీ సంజీవ్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని


సీఎం వైఎస్ జగన్‌తో మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య


ముఖ్యమంత్రికి బొకే అందజేస్తున్న మాజీ ఎంపీ బుట్టారేణుక, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోష్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మద్దయ్య, బెల్లం మహేశ్వరరెడ్డి.


కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ .


జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

గణనాథా.. నమోస్తుతే

- ప్రథమ పూజలందుకున్న పార్వతీ తనయుడు
- వీధి వీధినా కొలువు దీరిన గణనాథులు
- మట్టి వినాయక విగ్రహాలకు జై కొట్టిన భక్తులు
- పూజల్లో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు




కలెక్టరేట్‌లో వినాయక ఉత్సవాల సావనీర్‌ను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, కేంద్ర సమితి ప్రతినిధులు,వెంకటరమణ కాలనీలో స్వామి దర్శనానికి తరలివచ్చిన జనం


నగరంలో ఏర్పాటు చేసిన వైద్య విద్యా గణనాథుడు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమ మంగళవారాలు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మండ పాల వద్ద భక్తుల దర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. పెద్ద మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన 56 అడుగుల మట్టి వినాయక విగ్రహం, ఓల్డ్ సిటీలోని రాంబొట్ల ఆలయం, పప్పుల బజార్, మించిన్ బజార్, రంగరాజు వీధి, అశోక్ నగర్, బుధవారపేట మెయిన్ రోడ్, మద్దూరు నగర్, కురువ వీధి, సర్దార్ నాగప్ప వీధి, లాల్ బహదూర్ శాస్త్రి నగర్, బీక్యాంప్ పార్క్, ఇందిరా గాంధీ నగర్, వీఆర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా ఉండటంతో ఆయా మండపాల వద్ద భక్తుల సందడి అధికంగా ఉంది. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వహించిన పూజల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, రెవెన్యూ అధికారులు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. వేడుకలకు సంబంధించిన సావనీర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య, కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి 56 అడుగుల మట్టి వినాయక విగ్రహంతో పాటు నగరంలోని పలు మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్, ఉద్యోగులు పాల్గొన్నారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడికి సమితి జిల్లా అధ్యక్షులు క్రిష్టన్న, జిల్లా సంఘటనా కార్యదర్శి నాగఫణి శాస్త్రి, ఉపాధ్యక్షుడు సందడి సుధాకర్, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, కార్యాధ్యక్షులు సీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు కాళింగి నరసింహ వర్మ, రంగస్వామి, సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు హరీష్‌బాబు, ఏబీవీపీ నాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.


సి.క్యాంప్ పార్కులో క్యూలో నిల్చున్న భక్తులు ..


వెంకటరమణ కాలనీలో భజన కార్యక్రమం


సూర్య నారాయణ స్వామి ఆలయంలో గణపతి హోమం

ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అందించాలి

కర్నూలు(హాస్పిటల్): వినాయకుడు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అందించాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆకాంక్షించారు. స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్దకు ఆయన సతీసమేతంగా విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరైతే ఈ పండుగను జరుపుకుంటారో వారందరికీ వినాయకుడి ఆశీశులు పుష్కలంగా ఉంటాయని మన పురాణాలు చెబుతున్నాయి కాబట్టి ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ వై. మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి

పెద్దాసుపత్రికి వచ్చే పేద ప్రజల ఆరోగ్యాన్ని వినాయకుడు కాపాడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకట రంగారెడ్డి కోరారు. మంగళవారం ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ఆయన పూజలు నిర్వహించి, అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


అశోక్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వార్డు కార్పొరేటర్ వాసు


రాంబొట్ల ఆలయం వద్ద పూజల్లో కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి


మెడికవర్ హాస్పిటల్‌లో వినాయకుడి విగ్రహం వద్ద జిల్లా ఎస్పీ పి.కృష్ణకాంత్ దంపతులు


పెద్దాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ముందు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను అర్హుల ఇంటి వద్దకే చేర్చుతుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక 23వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన శ్రీరామ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో పథకాల కోసం పేద ప్రజలు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఎక్కడా ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటికి వచ్చి పథకాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుచిత రాణి, సునిల్, ఏసన్న, గిరిధర్, ప్రవీణ్, బలరాం, మద్దిలేటి, అరుణ్, అజయ్, వలి, రఫీక్ పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చూసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): బ్రేక్ డౌన్స్ కాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు.

తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలి

- పెండింగ్ ఫారాలు, ఆన్‌లైన్ చేయడంపై దృష్టిసారించాలి

కర్నూలు(సెంట్రల్): తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ముసాయిదా ఓటరు జాబితా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలను తగిన ధ్రువ పత్రాలతో డిస్పోజ్ చేయాలన్నారు. జంక్ క్యారక్టర్స్, ఒకే ఇంట్లు పది కంటే ఎక్కువ ఓటర్లు ఉండడం, చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు అవసరమైన డాక్యుమెంట్ల ఈఆర్‌ఓ సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ధ్రువపత్రాలు లేకుండా ఓటర్లను తొలగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫొటోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, మల్టిపుల్ ఎంట్రీస్, డెత్ కేసేస్, జంక్ క్యారక్టర్స్‌కు సంబంధించిన పెండింగ్ అంశాల పరిశీలన కచ్చితంగా జాతీయ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. 100 శాతం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి హేతుబద్ధీకరణ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ మల్లికార్జునుడు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ మురళీలు పాల్గొన్నారు.

తానా నారీ సాహిత్య భేరికి జిల్లా కవయిత్రి


బల్లూరి ఉమాదేవి

కర్నూలు కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక అమెరికాలో ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న నారీ సాహిత్య భేరి అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ బల్లూరి ఉమాదేవి ప్రత్యేక అతిథిగా వెళ్లనున్నారు. ఈ మేరకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగ వరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆహ్వానాన్ని పంపారు. 14 గంటల పాటు నిర్విరామంగా జరిగే సాహిత్య సమ్మేళనంలో భారత్‌తో పాటు విశ్వ వ్యాప్తంగా 15 దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు, రచయిత్రులు పాల్గొననున్నారు. ఇందులో ఉమాదేవి సాహిత్యం, కవిత్వంపై ప్రసంగించనున్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షురాలిగా పనిచేసిన ఈమె 2012లో పదవీ విరమణ పొంది సాహితీ సేవ చేస్తున్నారు. ఉమాదేవికి పలువురు సాహితీ వేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

మహానందిలో మళ్లీ ఎలుగుబంటి ప్రత్యక్షం


మహానందిలోని వివేకానంద పాతస్కూలు వద్ద ఎలుగుబంటి

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని పార్వతీపురంలో రెండ్రోజులుగా ఎలుగుబంటి సంచారంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి స్థానిక పార్వతీపురం కాలనీ ఎదురుగా ఉన్న పాత వివేకానంద స్కూల్ ప్రాంగణంలో కనిపించింది. అక్కడే ఉన్న హోటళ్ల, నివాస గృహాల వద్దకు వస్తుండటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల ఓ ఎలుగుబంటి ఈశ్వర్‌నగర్‌లోని తెలుగుగంగ క్వార్టర్స్ వద్ద ఉండగా బంధించి క్షేమంగా అడవిలో వదిలేసిన విషయం తెలిసిందే. అది మరువక ముందే తాజాగా మరో ఎలుగుబంటి సంచారంతో ఉద్యోగులు, భక్తులు, స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని పట్టుకుని అడవిలో దూరంగా వదిలిపెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


శతజయంతి నివాళి
రచనలు: హృదయ వీణ, వెలుగు రేఖలు, నవశకానికి నాంది రామకథ(బాలకాండ) అయ్యప్పస్వామి భక్తి గీతాలు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలో-రచనలు, కవితా సంపుటి తెలుగుతల్లి నీకు జోహారు-గేయం (తెలుగు అకాడమి ముద్రణ-4th Class తెలుగువాచకం (ముద్రణ).
పురస్కారం : గౌరవనీయులైన మాజీ ముఖ్యమంత్రి వర్యులు నందమూరి తారక రామారావు వారిచే ఆంధ్రప్రదేశ్ తరుపున రాష్ట్ర అవార్డు సహజ కవిగా బిరుదు.
మీరుచూపిన నీతి, నిజాయితీ, అంకితభావం మా జీవితాలకు పునాది. ఎల్లవేళలా మీ అడుగు జాడలలో నడుస్తామని మీకు శతజయంతి నివాళి.
సహజకవి సముద్రపు శ్రీ మహావిష్ణు
(జననం : 20.09.1923 - మరణం: 30.10.2004)
రిటైర్డ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, కర్నూలు.
కుమార్తె : డా॥ సముద్రపు స్వరూపరాణి M.SC.Ph.D బాటని లెక్చరర్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ, డోన్
అల్లుడు : పోతురాజు చౌదరి నరసింహులు M.Com.B.L, అడ్వకేట్
కుమారులు : కోడళ్లు
కుమార్తెలు : అల్లుళ్ళు
మనవలు : మనవరాండ్రు
మునిమనుమలు : మునిమనమరాండ్రు